సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 7 । మార్చి । 2025



స్కానింగ్‌పై స్పెషల్ టాస్క్‌ఫోర్స్..
నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది.

- 8లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ శుక్ర: 6:30 | సహర్ శని: 5:08

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.9 /9.2

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జడ్జి సునీత కుంచాల



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి : ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ కోర్టుల్లో దీర్ఘకాలికంగా కొనసాగుతున్న అపరిష్కృత కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్ లీగల్ యాక్షన్ రుణాలు తదితర కేసులు పరిష్కరింపబడతాయని పేర్కొన్నారు. ఇరుపక్షాలు రాజీ ఉన్నప్పుడే రాజీమార్గం సులువు అవుతుందని తెలిపారు. దూర ప్రాంతాల్లో ఉండే వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీ పద్ధతిలో కేసు పరిష్కరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదంలో నష్టపరిహారం కోసం, సైబర్ క్రైమ్ సంబంధిత కేసుల్లో కూడా న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మూడు నెలలకోసారి వచ్చే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి, సిబ్బంది నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకోవాలి

- డీఆర్డీవో సాయాగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

నిజామాబాద్‌అర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు టైలరింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం మండల సమాఖ్యల మాస్టర్ ట్రైనర్ల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్‌లో బల్క్ కట్టింగ్, ఖాజా, బటన్ కుట్టడంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌డీవో రవీందర్, డీపీఎం సాయిలు, ఏపీఎం రాజేందర్, శిక్షకులు మాధవి, లత, పద్మ, సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



బోధన్‌లో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవోదయ పంచాయితీ

- విద్యాలయం ఏర్పాటుపై రగడ
- ఎంపీ అర్వింద్ వర్సెస్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- ఘాటైన విమర్శలు చేసిన ఎంపీ
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య వార్
- పోటాపోటీగా దిష్టిబొమ్మలు దహనం చేసిన ఇరుపార్టీల శ్రేణులు

జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటు అంశం బీజేపీ, కాంగ్రెస్ మధ్య వివాదం రేపింది. ఎంపీ ధర్మపురి అర్వింద్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మధ్య రగడ ప్రారంభం కాగా, ఇరు పార్టీల శ్రేణులు పోటాపోటీగా దిష్టిబొమ్మలను దహనం చేశారు. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ వద్ద నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ఎంపీ అర్వింద్ 30 ఎకరాల స్థలాన్ని సూచించగా ఢిల్లీ అధికారులు సర్వే చేశారు. అయితే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆచన్‌పల్లి వద్ద నవోదయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలపై ఎంపీ అర్వింద్ తీవ్ర విమర్శలు చేశారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటు విషయమై రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్య పంచాయితీ ఏర్పడింది. ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మధ్య నువ్వా నేనా అనేవిధంగా రగడ మొదలైంది. ఈ నేపథ్యంలో ఎంపీ అర్వింద్ ఘాటైన విమర్శలు చేశారు. వివాదం మరింత ముదిరేలా పరిస్థితి తయారైంది. ఈ క్రమంలో రెండు పార్టీల శ్రేణుల మధ్య దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలకు ఆజ్యం పోసినట్లైంది. కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. ఒక విద్యాలయాన్ని కోరుట్లలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన నవోదయ విషయంలో ఇరుపార్టీల మధ్య సరికొత్త పోరుకు బీజం వేసింది. బోధన్, నిజామాబాద్ అర్బన్‌లో కేంద్రీయ విద్యాలయాలు ఉండడంతో నవోదయ విద్యాలయాన్ని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ వద్ద ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని ఎంపీ అర్వింద్ భావించారు. ఈ క్రమంలో కలిగోట్ వద్ద 1063 సర్వే నంబర్‌లో 30 ఎకరాల స్థలాన్ని ఎంపీ సూచించారు. ఢిల్లీ అధికారులు సర్వే సైతం చేశారు. అయితే మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మాత్రం ఆచన్‌పల్లి వద్ద 690 సర్వే నంబర్‌లోని స్థలంలో నవోదయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఈ ప్రతిపాదనలను ఢిల్లీ అధికారులు రద్దు చేశారంటూ, అసలు ఈవిధంగా ప్రతిపాదనలు చేయడమేమిటని ఎంపీ అర్వింద్ ఫైర్ అవుతున్నారు.

వేడెక్కిన రాజకీయం

అర్వింద్ వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య వార్ నెలకొన్నట్లైంది. నవోదయ అడ్డుకుంటున్నారంటూ బీజేపీ శ్రేణులు బుధవారం నిజామాబాద్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశాయి. దీంతో గురువారం ఎడపల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీల మధ్య నవోదయ అంశం రాజకీయంగా వేడి మరింత రగిలించినట్లైంది.

అడ్డుకోవడం సరికాదు : ఎంపీ అర్వింద్

సుదర్శన్‌రెడ్డి మతి తప్పి ప్రవర్తిస్తున్నారని, నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ భూమిని చూపించి ప్రతిపాదనలు చేయడమేమిటని ఎంపీ అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు నవోదయ విద్యాలయాలు మంజూరయ్యాయని, ఈ విషయమై తాను రెండు జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించినట్లు అర్వింద్ తెలిపారు. జగిత్యాల జిల్లా ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించడంతో కోరుట్లలో ఏర్పాటుకు రంగం సిద్ధమైందన్నారు. నిజామాబాద్ జిల్లాకు మంజూరైన నవోదయను తమ పార్టీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణను ఒప్పించి జాతీయ రహదారికి దగ్గరలోని జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ వద్ద 30 ఎకరాల్లో ప్రతిపాదించామన్నారు. కానీ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాత్రం బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి చెందిన భూమిలో నవోదయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ముందుకు రాగా అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అడ్డుపడడమేమిటని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నవోదయ ఏర్పాటుకు 30 ఎకరాలు అవసరం కాగా, షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 8 ఎకరాలను సుదర్శన్‌రెడ్డి ప్రతిపాదించడం అనాలోచితమన్నారు. నవోదయ ఏర్పాటుకు షుగర్ ఫ్యాక్టరీ భూమిని ప్రతిపాదించడం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి షుగర్ ఫ్యాక్టరీని తెరిచే ఆలోచన లేదా అని ఎంపీ ప్రశ్నించారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న శ్రద్ధ జిల్లా అభివృద్ధిపై లేదని, 40 ఏళ్లలో ఆయన జిల్లాకు ఒరగబెట్టిందేమీ లేదని ఘాటైన విమర్శలు చేశారు. ఇక రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమానాశ్రయాన్ని తీసుకురాలేకపోయినప్పటికీ, ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిన నవోదయను ఏర్పాటు చేసుకోలేరా అన్నారు.

మొదటిరోజే ఒకరు డిబార్



ధర్మారం(బి)లో ఇంటర్ పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

- ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 420 మంది గైర్హాజరు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 16,343 మంది విద్యార్థులకు 15,923 మంది పరీక్షలకు హాజరుకాగా, 420 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల(బీ) సెంటర్‌లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకొని మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసిందన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లతోపాటు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు రవి కుమార్ తెలిపారు.

పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపల్ మాధవీలత, తహసీల్దార్ ప్రభాకర్ ఉన్నారు.

బైక్ సైలెన్సర్ల ధ్వంసం

- రోడ్ రోలర్‌తో తొక్కించిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్ రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖలీల్‌వాడి: నిబంధనలకు విరుద్ధంగా బైక్‌లకు అమర్చిన భారీ శబ్దం చేసే 240 సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బైక్ సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రెండు, మూడు నెలల నుంచి వాహన తనిఖీలు చేస్తూ సైలెన్సర్లను తొలగించి వారిపైన చర్యలకు ఆదేశించామన్నారు. ప్రత్యేక సైలెన్సర్లను అమర్చితే మెకానిక్‌లు, వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ధర్మారం(బి) గురుకుల కళాశాల పరిశీలన



గురుకుల కళాశాల స్టోర్ రూంలో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. మెస్ హాల్, వంటగది, పాఠశాల, కళాశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని కిచెన్, డైనింగ్ హాల్, క్లాస్ రూమ్‌లు, డార్మెటరీ, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ప్రిన్సిపల్ మాధవీలతను అడిగి తెలుసుకున్నారు. వంట నూనె, పాలు, పండ్లు, కోడిగుడ్ల నాణ్యత పరిశీలించిన కలెక్టర్, కాలపరిమితి ముగిసిన వాటిని వినియోగించొద్దని నిర్వాహకులకు సూచించారు. నాసిరకం బియ్యం, ఇతర సరుకులు వస్తే మండల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరలో జరిగే వార్షిక పరీక్షల కోసం పదో తరగతి విద్యార్థినులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు తక్షణమే పనులు జరిపిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్ ఉన్నారు.

తొలి ప్రాధాన్యం ఆ గ్రామాలకే..

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం
- పైలెట్ గ్రామాల్లోనే ముగ్గు పోయిస్తున్న అధికారులు
- దశల వారీగా ఇతర గ్రామాల్లో అనుమతులు ఇచ్చే అవకాశం



గురువారం కోమన్‌పల్లిలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణ స్థలాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోర్తాడ్(బాల్కొండ): సొంత జాగా ఉండి ఇంటిని నిర్మించుకునేవారికి ఆర్థికసాయం అందించే విషయంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. అయితే తొలి విడతలో పథకం విస్తరణ పరిమితంగానే ఉంది. గణతంత్ర దినోత్సం రోజు ఆరు పథకాల అమలుకు 'పైలెట్' గ్రామాలుగా ఎంపిక చేసిన చోటే ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో నియోజకవర్గానికి ఏడాదిలో 3,500 ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వం అనేకమార్లు వెల్లడించింది. పథకం అమలులోకి వచ్చిన తర్వాత చేసిన ప్రకటనలకు, కార్యాచరణకు పూర్తి వైరుధ్యం కనిపిస్తోంది. జిల్లాలోని 31 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేయగా, మొత్తం 2,300 మందిని లబ్ధిదారులుగా గుర్తించి ఇళ్ల నిర్మాణాలకు అధికారులు ముగ్గులు పోయిస్తున్నారు.

ఆశతో ఎదురుచూస్తున్న పేదలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున సాయం అందితే తమ సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఎంతోమంది ఉన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియక ముందే ఇళ్ల నిర్మాణం ఆరంభిస్తే వచ్చే ఏడాది మరో విడత ఇళ్ల నిర్మాణానికి సాయం అందించేందుకు అవకాశం ఉంటుంది.

ఈసారైనా కల నెరవేరేనా!

సొంత స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ద్వారా సాయం అందించే పథకం ఎప్పటి నుంచో కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకాన్ని తీసుకొచ్చింది. కొన్నాళ్లకే ఆ పథకానికి ఎగనామం పలికింది. 2023 ఎన్నికలకు ముందు కేసీఆర్ సర్కార్ గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకమూ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. కనీసం ఇప్పుడైనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని వేగంగా అమలు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాల కల సాకారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **ఎంపిక చేసిన గ్రామాల్లోనే మార్కింగ్ చేస్తున్నాం**
>
> పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేయిస్తున్నాం. దశల వారీగా ఇతర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ప్రతి ఇంటి నిర్మాణానికి నాలుగు దశల్లో రూ.5 లక్షల సాయం అందుతుంది.
>
> – సత్యనారాయణ, ఏఈ, గృహనిర్మాణ సంస్థ

పిల్లలకు 'ఫ్రెండ్లీ' న్యాయసేవలు

- చట్టాలు– హక్కులపై అవగాహన కల్పిస్తోన్న న్యాయసేవాధికార సంస్థ
- సత్ప్రవర్తన పెంపొందించేందుకు కృషి
- పాఠశాలల్లో న్యాయవిజ్ఞాన సదస్సుల నిర్వహణ
- విస్తృతంగా పర్యటిస్తున్న పారా లీగల్ వలంటీర్లు



ఆర్మూర్‌లోని భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీర్లు

ఆర్మూర్: కల్లాకపటం ఎరుగని నిర్మల, సున్నిత మనస్కులు పిల్లలు. లేత వయసులోనే పిల్లలపై పరిసరాలు, పరిస్థితులు ప్రభావం చూపుతాయి. దీంతో కొంతమంది పిల్లలు 'మాకు అన్నీ తెలుసు' అంటూ తప్పటడుగులు వేస్తుంటారు. మరికొందరు తమకు ఎదురైన.. ఎదురవుతున్న ఆటంకాలను ఎదుర్కోలేక ఇబ్బందులకు గురవుతుంటారు. విద్యార్థుల్లో మంచి ప్రవర్తన తేవడంతోపాటు అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలు తదితర వాటి నుంచి కాపాడుకునేందుకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తోందీ నేషనల్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ.

న్యాయవిజ్ఞాన సదస్సులు

బడీడు పిల్లలకు స్నేహ పూర్వక న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్‌ను నిజామాబాద్ జిల్లాలో విస్తృతం చేసింది. అందులో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి పి.పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ప్రభుత్వ పాఠశాలు, స్వచ్ఛంద సేవా సంస్థలను సందర్శిస్తూ న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నాయి. ఈ బృందాల్లో సీనియర్ న్యాయవాదులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులతోఏర్పాటు చేసిన పారా లీగల్ వలంటీర్లు సేవలందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కార మార్గాలతో రూపొందించిన నివేదికను జిల్లా న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్‌కు సమర్పిస్తున్నారు. నివేదికపై న్యాయమూర్తి ఆయా శాఖల ఉన్నతాధికారులకు పలు సలహాలు, సూచనలు ఇస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారు.

గురుకులాలు, భవిత కేంద్రాల్లో..

జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలతోపాటు సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలను ప్రత్యేక బృందాలు సందర్శిస్తున్నాయి. బృందాల్లో పారా లీగల్ వలంటీర్లు ఏ.బాబాగౌడ్, సీహెచ్ విద్యాసాగర్ రావుతోపాటు న్యాయవాదులు సంధ్య, రవీందర్, ఉదయ కృష్ణ, ఉమామహేశ్, వినీల, నర్సింహ ఉన్నారు. వీరు ఇప్పటి వరకు నిజామాబాద్ నార్త్, సౌత్, ఆర్మూర్, నవీపేట్ మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీని సందర్శించి దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సేవలు, వారి హక్కులు, కావాల్సిన అవసరాలపై నివేదిక తయారు చేశారు. ఆర్మూర్, బాల్కొండ, మోర్తాడ్, డిచ్‌పల్లి మండలాల్లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు.

న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించేలా..

నేర విచారణలో ప్రతివాదులు లేదా సాక్షులుగా వివిధ కారణాలతో పిల్లలకు న్యాయసేవలు అవసరం కావొచ్చు. భౌతిక, మానసిక హింస, లైంగిక వేధింపులు లేదా ఇతర నేరాలు, హక్కుల ఉల్లంఘనల బాధితులుగా పలు కేసుల్లో పిల్లలు నిలుస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత, వైకల్యంతో సహా సమస్యలపై పలు కేసులు పిల్లల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పిల్లలు విజయవంతంగా వారి కుటుంబాలతోపాటు సమాజంలో పునరావాసం పొందేలా న్యాయసేవాధికార సంస్థ తనవంతు సాయాన్ని అందిస్తోంది. బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంచుతోంది. దీంతో న్యాయ వ్యవస్థపై పిల్లల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేస్తుంది.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> విద్యార్థి దశ నుంచే న్యాయపరమైన సేవలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో పిల్లలు స్వీయ రక్షణలో సైతం నిష్ణాతులుగా మారతారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం.
>
> – సీహెచ్.జీవన్‌రావు, పారా లీగల్ వలంటీర్

> **దివ్యాంగుల సౌకర్యాలపై నివేదిక**
>
> 
>
> దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నాం. భవిత కేంద్రాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థుల హక్కులతోపాటు వారికి అందిస్తున్న సేవలపై నివేదికను న్యాయమూర్తికి అందజేస్తున్నాం.
>
> – ఏ.బాబాగౌడ్, పారా లీగల్ వలంటీర్

క్లుప్తంగా

నాట్య పరీక్షలు ప్రారంభం



కూచిపూడి పరీక్షలకు హాజరైన విద్యార్థినులు

ఆర్మూర్: పట్టణంలోని నటరాజ నృత్య నికేతన్ శాస్త్రీయ నృత్య శిక్షణ కేంద్రంలో గురువారం నాట్య గురువు బాశెట్టి మృణాలిని ఆధ్వర్యంలో కూచిపూడి పరీక్షలను నిర్వహించారు. 20 మంది చిన్నారులు నృత్య పరీక్షకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మాడవేటి నారాయణ, బాశెట్టి మృణాళిని మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం కేవలం ప్రదర్శనకు పరిమితం కాకుండా, శాస్త్ర సంబంధ విషయాలను సిద్ధాంత, శ్లోక ప్రయోగాలుగా విభజించి, దశలవారీగా నేర్పే విద్యా విధానాన్ని రూపొందించామన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. నాట్యాచారిని ఉదయశ్రీ పరీక్ష నిర్వహణ అధికారిగా వ్యవహరించారు.

తెయూ సైన్స్ డీన్‌గా సంపత్ కుమార్ నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ సంపత్‌కుమార్ నియమితులయ్యారు. తెయూ వీసీ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం సంపత్‌కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. స్టాటిస్టిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్న సంపత్‌కుమార్ ప్రస్తుతం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో డీన్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా లక్ష్మణచక్రవర్తి ..



తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి నియమితులయ్యారు. తెయూ వీసీ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం లక్ష్మణ చక్రవర్తికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతిగా లక్ష్మణ చక్రవర్తి విధులు నిర్వహిస్తున్నాడు. లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీసులకు ఫిర్యాదు

ఖలీల్‌వాడి: హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు బస్సులో వస్తున్న సమయంలో గొలుసు పోయిందని బాధితుడు హరీశ్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. నగరంలోని గాజులపేట్‌కు చెందిన హరీశ్ హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా మెడలో ఉన్న బంగారు గొలుసు పోయింది. దీంతో ఒకటో టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

వలకు చిక్కిపోతున్నారు

- చేపల వేటలో మత్స్యకారుల మృతి
- ఎస్సారెస్పీలో వరుస మరణాలు
- అందని అధునాతన పరికరాలు
- బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం



గోదావరిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న తోటి మత్స్యకారులు (ఫైల్)

బాల్కొండ: జీవనోపాధి కోసం శ్రీరాంసాగర్ జలాశయంలో చేపలు వేటాడుతున్న మత్స్యకారులు.. వేటకు ఉపయోగించే వలలకు బలవుతున్నారు. ప్రాజెక్టులో చేపల కోసం వేసిన కంచ్రీలు(వలలు) కాళ్లకు చుట్టుకొని నీటమునిగి మృత్యువాతపడుతున్నారు. గత నెలలో బాల్కొండకు చెందిన బట్టు నారాయణ, ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బట్టు నడ్పిరాజన్న ప్రమాదవశాత్తు మరణించారు. వారం వ్యవధిలో ఇద్దరు గంగపుత్రులు దుర్మరణం చెందడంతో మత్స్యకారులు చేపల వేటాడేందుకు జంకుతున్నారు.

పడితే షికారీ..లేదంటే బికారీ..

కులవృత్తినే నమ్ముకున్న గంగపుత్రులు జీవనోపాధి కోసం నిత్యం చేపల వేట సాగిస్తున్నారు. ఈ క్రమంలో చేపలు పడితే షికారీ లేదంటే బికారీ అన్న చందంగా మత్స్యకారుల పరిస్థితి తయారైంది. ఎస్సారెస్పీలోకి నిత్యం మత్స్యకారులు చేపలు వేటాడుతారు. ఇంటి నుంచి వెళ్లిన మత్స్యకారుడు తిరిగి ఇంటికి చేరే వరకు బిక్కుబిక్కుమంటూ చూడాల్సిన పరిస్థితి నెలకొందని మత్స్యకారుల కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. తెల్లవారుజాము నాలుగు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన వారు మళ్లీ చీకటి అయ్యాకే ఇంటికి చేరుకుంటారు.

శిక్షణ కరువు

మత్స్యకారులు ప్రమాదాలకు గురికాకుండా చేపలు వేటాడేలా అధునాతన పరికరాలున్నాయి. కానీ, అవి ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు చేరడం లేదు. కనీసం ప్రమాదాల బారినపడకుండా శిక్షణ ఇచ్చేవారూ కరువయ్యారు. బోట్లు ఇస్తామన్న ప్రభుత్వం ముఖం చాటేసిందని మత్స్యకారులకు చెబుతున్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రమాదవశాత్తు మత్స్యకారులు మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందడం లేదు. కానీ, రూ. 5లక్షల ఇన్సూరెన్స్ మాత్రం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం స్పందించి బాధిత మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరుతున్నారు.

ఆపదమిత్ర ద్వారా శిక్షణ ఇస్తున్నాం..

ఎస్సారెస్పీలో దురదృష్టవశాత్తు ప్రమాదాలు జరుగుతున్నాయి. మత్స్యకారులు ప్రమాదాలబారిన పడితే కాపాడుకోవడం కోసం ఆపదమిత్ర ద్వారా శిక్షణ ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ డబ్బులు ఇస్తోంది.

– దామోదర్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

‘సాగర్’ నీటి విడుదల నిలిపివేత



నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు గురువారం సాయంత్రం నీటి విడుదలను నిలిపి వేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంట పొలాలకు గత నెల 21 నుంచి ప్రధాన కాలువ ద్వారా నాలుగు దఫాలుగా నీటిని విడుదల చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో అవసరం మేరకు నీటి విడుదలను నాలుగైదు రోజుల పాటు పొడిగించారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరందడంతో నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం1405 (17.8 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 1396.96 (8.392టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. మరో రెండు దఫాలు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఇద్దరి చొప్పున(నామినేట్) ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చట్ట సాధన కోసం లక్ష సంతకాల మహోద్యమాన్ని చేపడుతామని తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం వేదిక జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన జిల్లాస్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. దివ్యాంగుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడుతామన్నారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్వరాజు, ప్రతినిధి సంగప్ప, గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి యేశాల గంగాధర్, ప్రతినిధులు రాంపటేల్, ఎస్‌కే నజీర్, రాకేష్, సాయమ్మ, ఎల్లయ్య, గోపాల్‌యాదవ్, సాయిలు, లక్ష్మణ్, హరీష్ పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ‘ఐఏఎస్’ వివాహం



నూతన వధూవరులతో భద్రాద్రి జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ, పీవో తదితరులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని రాముడి సన్నిధిలో నిజామాబాద్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి స్నేహ వివాహం చేసుకున్నారు. స్నేహ ప్రస్తుతం ఒడిశా కేడర్‌లో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి అఖిల్‌రెడ్డితో వివాహం నిశ్చయం కాగా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన మారుతీ సదనంలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గురువారం జరిగిన వీరి వివాహానికి భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్, జడ్జి శివనాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏటీడీఏ పీవో బి రాహుల్ హాజరయ్యారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



ఘటన స్థలంలో విఠల్ మృతదేహం

మాక్లూర్: జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న ఓ కూలీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుత్ప శివారులోగల 63వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరుగగా.. . మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. గత రెండు రోజులుగా జాతీయ రహదారిపై ప్యాచ్ వర్కు పనులు జరుగుతున్నాయి. గుత్ప శివారులోని జాతీయ రహదారిపై గవారే విఠల్ (45) అనే కూలీ ప్యాచ్ వర్కు చేస్తున్నాడు. ఈక్రమంలో వేడి చేసిన డాంబర్ కోసం అతడు రోడ్డు దాటుతుండగా నిజామాబాద్‌వైపు నుంచి ఆర్మూర్ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో విఠల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

● రైలు ఢీకొని వృద్ధుడు..

ఖలీల్‌వాడి: రైలు పట్టాలు దాటుతుండగా ఓ వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ హరికృష్ణ, రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లమ్మగుట్టకు చెందిన బొందెలు ప్రతాప్‌సింగ్ (60) పూలాంగ్ వాగు బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● చెరువులో పడి వివాహిత మృతి

సిరికొండ: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వివాహిత మృతి చెందిన ఘటన సిరికొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రామ్ తెలిపిన వివరాలు ఇలా.. నెల్లూరు జిల్లా, గంగులవారి చెరువుపల్లి గ్రామానికి చెందిన దంపతులు తిన్నవెళ్లి అశోక్ కుమార్, బొంతల పూజ సిరికొండలో ఒక మేస్త్రి వద్ద కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పూజ మూడు రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే ఆమె పుట్టింటికి చేరలేదని తెలియడంతో భర్త అశోక్ కుమార్ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సిరికొండలోని ఎల్లమ్మ చెరువులో గురువారం మహిళ మృతదేహం లభ్యమైంది. అది పూజ మృతదేహంగా అశోక్ కుమార్ నిర్ధారించినట్లు ఎస్సై తెలిపారు. కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయినట్లు భర్త అశోక్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● మద్యం తాగి.. స్పృహతప్పి ఒకరు..



రాములు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): ఓ వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి, స్పృహ తప్పి మృతిచెందిన మహమ్మద్ నగర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాగి రాములు (45) బుధవారం మహమ్మద్ నగర్ మండలం ముగ్దుంపూర్ గ్రామంలో ఓ పెళ్లి వేడుకకు వచ్చాడు. అతడు ఫుల్లుగా మద్యం తాగి పెళ్లి కూతురును తీసుకురావడానికి వెళ్తానని చెప్పడంతో బంధువులు వద్దని వారించారు. అనంతరం పెళ్లి కొడుకు తల్లిదండ్రులతో గొడవపడటంతో అతడి భార్య తులసమ్మ సర్దిచెప్పి రాములును అదేరోజు రాత్రి ఎల్లారెడ్డికి తీసుకెళ్లింది. కానీ అప్పటికే అతడు స్పృహ తప్పడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అతడు మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నిజామాబాద్ రూరల్: మండలంలోని గొల్లగుట్ట తండా దర్గా వద్ద గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ గురువారం తెలిపారు. దర్గా దగ్గర ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ వద్ద వ్యక్తి మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. మృతుడు సుమారు 40–50 ఏళ్ల వయస్సు ఉంటాడని తెలిపారు. ఎవరైన మృతుడిని గుర్తించినట్లయితే రూరల్ ఎస్‌హెచ్‌వో ఫోన్ నంబర్ 8712659849కు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 8712659847కు సంప్రదించాలని కోరారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కోతుల దాడిలో ఓ వ్యక్తి గాయపడినట్లు స్థానికులు గురువారం తెలిపారు. సంగయ్య అనే వ్యక్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా కోతులు సంగయ్యపై దాడి చేసి కరవడంతో అతడి కాలుకు తీవ్రగాయం అయింది. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్‌శాఖ దాడులు

రాజంపేట: మండలంలోని గుండారం గ్రామంలో బెల్ట్‌షాపులపై గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు షాపులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై దీపిక తెలిపారు. 4.48 లీటర్ల మద్యం, 3.9లీటర్ల బీర్లను సీజ్ చేసినట్లు వివరించారు. కాని స్టేబుళ్లు జీవన్, మహేష్, బాలరాజు ఉన్నారు.

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన సైదుగారి శ్రావణ్ (23) కల్లుబట్టీలో కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతడికి గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. మద్యానికి బానిసై పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రావణ్ పశువులకొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మాక్లూర్: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి సాయమ్మ(35), తన భర్తతో గొడవ పడింది. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం కుటుంబ కలహాల కారణంగా ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. మంటలు చెలరేగగా వెంటనే స్పందించిన స్థానికులు మంటలను ఆర్పివేసి, ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, 50 శాతం గాయాలు అయినట్లు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలి



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ జడ్జి పద్మావతి

తెయూ(డిచ్‌పల్లి): సమాజంలో అన్ని రంగాలలో మహిళలు దూసుకుపోవాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ జడ్జి పద్మావతి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన గురువారం తెయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో జడ్జి పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల సమగ్ర అభివృద్ధియే దేశాభివృద్ధికి మూలమని అన్నారు. ఇటీవల ఎక్కువ మంది మహిళలు సైబర్ మోసాలకు గురవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెయూ వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మహిళలు ప్రవేశించని రంగం లేదన్నారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలను అగ్ర భాగాన నిలిపేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల సంపూర్ణ సహకారంతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం జడ్జి పద్మావతిని వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ప్రొ ఫెసర్ విద్యావర్ధిని, అరుణ, లావణ్య, ఆరతి, అప ర్ణ, శిరీష, అధ్యాపకులు నందిని, నీలిమ, శాంతాబాయి, కిరణ్మయి, ప్రసన్నరాణి, స్రవంతి ఉన్నారు.

స్కానింగ్‌పై ‘స్పెషల్ టాస్క్‌ఫోర్స్’

- లింగనిర్ధారణ పరీక్షలకు అడ్డుకట్ట పడేలా చర్యలు
- ప్రత్యేక బృందంతో స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నగరంలోని స్కానింగ్ సెంటర్‌లలో తనిఖీలు చేస్తున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం

నిజామాబాద్‌నాగారం: నిబంధనలకు తిలోదకాలిస్తూ నడుపుతున్న స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం కొరఢా ఝుళిపించేందుకు సిద్ధమైంది. ఇటీవల ఖమ్మం జిల్లాలో కారులోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, పుట్టబోయేది బాలిక అని తేలితే ప్రైవేటు ఆస్పత్రిలో అబార్షన్ చేయిస్తున్న ముఠాను పట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ భ్రూణ హత్యలకు ప్రేరేపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఆరుగురితో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. నిజామాబాద్ జిల్లాలో ప్రత్యేక బృందం గురువారం నుంచి స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు ప్రారంభించింది. వారం రోజులపాటు ప్రత్యేక కమిటీ జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయనుంది. గురువారం జిల్లా కేంద్రంలోని మెడికవర్, మనోరమ ఆస్పత్రులను ప్రత్యేక బృందం తనిఖీ చేస్తుండగా, డీఎంహెచ్‌వో డాక్టర్ బి రాజశ్రీ పర్యవేక్షించారు.

జిల్లాలో 126 స్కానింగ్ సెంటర్లు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 156 స్కానింగ్ సెంటర్లు ఉండగా, 30 సెంటర్లను నిర్వాహకులు మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఆర్మూర్ డివిజన్‌లో 30, బోధన్ డివిజన్‌లో 16, నిజామాబాద్ డివిజన్‌లో 80, మొత్తం 126 సెంటర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కాగా, స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. వాటన్నింటినీ తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఎంహెచ్‌వో) వద్ద నమోదు చేయించుకున్న స్కానింగ్ మిషన్లను రిజిస్టర్డ్ డాక్టర్లు మాత్రమే నిర్వహించాలి. డాక్టర్ సిఫారసు చేసిన స్లిప్ ఇచ్చిన తర్వాతే స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. ఫామ్ (ఎఫ్)లో గర్భిణి అనుమతి, వైద్యుడి సంతకం, గర్భిణి గుర్తింపు కార్డు, స్కానింగ్ రిపోర్టు తప్పనిసరిగా జతపర్చాలి. సెంటర్‌లో ప్రతిరోజూ నిర్వహించే స్కానింగ్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు ప్రతినెలా నివేదికను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. స్కానింగ్ రికార్డులను రెండు సంవత్సరాల వరకు నిర్వాహకులు భద్రపరచాలి. ఈ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ పని చేస్తోంది.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇదే..

- ప్రోగ్రాం ఆఫీసర్ ఎంసీహెచ్/డిప్యూటీ డీఎంహెచ్‌వో
- గైనకాలజిస్ట్
- మహిళా తహసీల్దార్
- మహిళా పోలీస్ ఆఫీసర్
- సఖీ కన్సల్టెంట్
- డాటా ఎంట్రీ ఆపరేటర్

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లలో తనిఖీ చేస్తుంది. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. నియమ, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్ నిర్వహణపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

మొరం తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

- అధికారులకు 7టిప్పర్లు, పొక్లెయిన్ అప్పగింత

రెంజల్(బోధన్): అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ మొరం తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన మండలంలో నీలా గ్రామంలో చోటుచేసుకుంది. మొరం టిప్పర్లతోపాటు పొక్లెయిన్‌ను పట్టుకొని, రాత్రంత చెరువు వద్దనే జాగారం చేసి, అధికారులకు అప్పగించారు. రెంజల్ మండలం నీలా ఖజానా కుంట నుంచి రాత్రి సమయంలో అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలుసుకున్నారు. దీంతో బుధవారం రాత్రి చెరువు వద్దకు చేరుకొని మొరం తరలించేందుకు సిద్దంగా ఉన్న 7టిప్పర్లతో పాటు పొక్లెయిన్‌ను అడ్డుకున్నారు. అధికారులు రాకపోవడంతో గ్రామస్తులు అక్కడే నిద్రించారు. ఇరిగేషన్ అధికారులు, పోలీసులు గురువారం చెరువు వద్దకు చేరుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నా రాత్రి సమయంలో తరలించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వ పనుల పేరుతో మొరంను అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బోధన్ సబ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో గ్రామస్తులు పట్టుకున్న వాహనాలను పోలీసుకులకు అప్పగించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరెపల్లి వాగు వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అడవిపందుల దాడిలో మక్కపంట ధ్వంసం



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అడవిపందుల దాడిలో మక్క పంట ధ్వంసం అయ్యింది. గురువారం వేకువజామున గ్రామానికి చెందిన మంద చిన్ననర్సింలుకు చెందిన మక్కపంటలో అడవి పందులు దాడిచేశాయి. దీంతో మూడు ఎకరాల పంట ధ్వంసం అయినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నిజామాబాద్ సిటీ: రేషన్ బియ్యం రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మోపాల్ మండలం సిర్పూర్ గ్రామ శివారులో భాజ మహేష్ అనే వ్యక్తి బైక్‌పై బియ్యం తరలిస్తుండగా సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీచేశారు. 2.32 క్వింటాళ్ల రేషన్ బియ్యంగా నిర్ధారించారు. మహేష్‌ను విచారించగా.. గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యం తక్కువ రేటుకు కొని నిజామాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపాడు. అనంతరం బియ్యంతో పాటు మహేష్‌ను సివిల్ సప్లయ్ అధికారులు మోపాల్ పోలీసులకు అప్పగించారు. మోపాల్ ఎస్‌ఐ యాదగిరి కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్ వద్ద ఆగిఉన్న పాఠశాల బస్సును లారీ ఢీకొట్టింది. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్ వద్ద గురువారం విద్యార్థులు రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో వాహనాలతోపాటు స్కూల్ బస్సు ఆగి ఉండగా వెనుక నుంచి లారీ వచ్చి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు ముందున్న వాహనాలను ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో పలువురి వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కారణమైన లారీ యజమానిపై కేసు నమోదు చేశామని, తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.